సృజన
సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల వేదిక
www.srujananedu.com

# పాకనాటి వారి ప్రాభవం
# "మా చెట్టునీడ"


మనదేశానికి పురాణాలున్నాయి కానీ చరిత్ర తక్కువ. ఇంత వరకు మనం చదువుకున్న చరిత్ర ఎంత నిజమో ఎవ్వరికెరుక. ఎందుకంటే అప్పుడు చదువుకున్న చాలా చరిత్ర మనది కాదంట. అందులో చాలా వరకూ నిజాల్లేవని ఇటీవలే కొత్తకొత్త చరిత్రలు నిజాలను చెబుతున్నట్టు అనేక కథలు పుట్టుకొస్తున్నాయి. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఒక చరిత్రకు సంబంధించిన పుస్తకం వెలుగు చూసిందంటే కాస్తయినా ఆసక్తి కలగక మానదు. ఎక్కడో భారతదేశపు వెలుపలుండి(మలేసియాలో)అన్ని భోగాలు అనుభవించడానికి అవకాశం ఉండి కూడా తన మూలాల వైపు ఈ గ్రంథ రచయిత ఆలోచించాడంటే ముందుగా మనం అతనిలోని సాహిత్య సంస్కారాన్ని, ఆయనలోని భాషాప్రియత్వాన్ని తప్పకుండా కొనియాడాల్సిందే. ఈ గ్రంథ రచయిత పాకనాటి వంశీయుల గురించి ఏడుతరాల చరిత్రను క్రమపద్ధతిలో రాశారు. ఇంతమాత్రానికేనా అని పెదవి విరవకండి, కేవలం తమ వంశీయుల గురించే కాకుండా ఆయా కాలాల్లో జరిగిన వాస్తవిక, సామాజిక, రాజకీయ స్థితిగతులన్నీ ఏ మాత్రం జంకులేకుండా పచ్చి నిజాలను రాశాడు ఈ గ్రంథ రచయిత సుధీర్ రెడ్డి. కేవలం నిజాలని అల్లాడిపోయాడనే విషయం మనకు అర్థమవుతుంది. ఎందుకంటే ఆయా అధ్యా యాలను మనం చదువుతుంటే కాస్త గందరగోళానికి లోనవడం సహజమే. అయితే కాస్త నెమ్మదిగా ఆలోచిస్తే విషయాలు చాలా చెప్పాలనుకున్నాడు. ఆ ఆలోచనలన్నీ నిక్షిప్తం చేసే క్రమంలో చిన్న తడబాటు పడినట్టుగా అనిపిస్తుంది. అయితే కొన్ని విశ్వ విద్యాలయాల్లో జరుగుతున్న, జరిగిన పరిశోధనలను గమనించినప్పుడు సుధీర్ రెడ్డి చేసింది చాలా పెద్ద పరిశోధనే అనిపిస్తుంది. అందులో పరిశోధించదగ్గ విషయాలున్నాయి కూడా.

పుస్తక ప్రారంభంలో సాహిత్యానికీ, చరిత్రకీ జరిగిన మోసాన్ని ఎండగడుతూ కైఫీయతులు రాయించిన విధానాన్ని తప్పుబడుతూ నిధి, నిక్షేపాలు దొరికే ప్రాంతాలైన దక్షిణ భాగ గ్రామ చరిత్రలు శ్రద్ధగా రాయించారనీ, కృష్ణానదికి ఉత్తరభాగాన్ని నిర్లక్ష్యం చూపారనీ అంటాడు రచయిత. (పుట-3)

నిధి నిక్షేపాల కోసం చెంచులను దారి దొంగలుగా 'కొలీన్ మెకంజీ' వేసిన నింద గురించి, వారిని మధించే పనిని పూర్తిగా శ్రీ రాజా వెంకటాద్రినాయుడుకు అంటగట్టడంలాంటి మోసాలను చదువుతుంటే ఎంత అమానవీయంగా ప్రవర్తించారో కదా మనవాళు అనిపిస్తుంది. వెంకటాద్రినాయుడు కట్టించిన దేవాలయాలు కేవలం తొమ్మిదే అయితే వాటిని చరిత్రలో 108 గా లిఖించడం ఎంత మోసపూరితమో అర్థం చేసుకోవచ్చు. తాను చేసిన మోసం ఎక్కడ బయట పడుతుందో అని తాను ఎన్ని నిద్రలేని రాత్రులు గడిపాడో వెంకటాద్రినాయుడి గురించి చదివితే అవగతమవుతుంది. అంతేకాకుండా రాయలసీమను రక్షించిన పాలేగాళ్లను దేశద్రోహులుగా, దారి దోపిడీదారులుగా, ఫ్యాక్షనిష్టులుగా చిత్రీకరించిన తెల్లదొరల మోసాన్ని మనం నేటికీ మోస్తుండటాన్ని అధ్యయనం చేస్తే చరిత్ర ఎంత వక్రీకరించారో, ఎంత తప్పుదోవ పట్టించారో ఆలోచిస్తే కునుకు పట్టదు. దత్తమండలాలలో ఉన్న పాలెగాళ్లను బెదిరించి దత్తమండలాలకు వచ్చిన కలెక్టర్ థామస్ మన్రో, వారిని బెదిరించి, ఆస్తులను ఆక్రమించడానికి వారు చేయని దుశ్చర్యలు లేవు. బ్రిటీష్ వారి మాట వినక పోయేసరికి వాళ్లను గుత్తికోటలో ఎనిమిది సంవత్సరాలు బంధించారంట. కొంత మందిని ఉరితీశారు. ఊరొదిలి వెళ్లిపొమ్మన్నారు. ప్రజల్లో పాళెగాళ్లపై రాయలసీమ జనం కన్నీళ్లేనండోయ్.

శ్రీ పేకేటి రంగారెడ్డి శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని గుంటూరులో లాఠీచార్జ్ కు గురైన సంగతిని గుర్తుచేశారు. భగత్సింగ్ గురించి వాస్తవ విషయాలను వెల్లడించారు. సరోజినీ నాయుడు, గాంధీ, బాలగంగాధర్ తిలక్ ల స్వతంత్ర్యాపేక్షను వాస్తవమైన విషయాలతో సవివరంగా తెలియజేశారు. అమ్మ బాష గురించి , అస్పృశ్యత గురించి మహనీయులు గాంధీజీ, అంబేద్కర్ చూపిన చొరవను గురించి చెప్పిన దారిని కొనియాడారు. రాయలసీమ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గురించి, మాహిష్మతి రాజ్యం గురించి తెలియని శుద్దులను వివరించారు. గోదావరి గలగలలు కృష్ణమ్మ కిలకిలలు, ఎండమావులను నిండు బావులుగా మార్చిన జలాశయాలను నిర్మించిన ఇంజనీర్లను, వాటికి కారణమైన జమీందార్లను వాసిరెడ్డి రామగోపాలకృష్ణ లాంటి ఉదారవాదులను, వారి దూరదృష్టిని కొనియాడారు. అరవ రాష్ట్రంతో ఆంధ్రులు పడ్డ ఇక్కట్లు వివరించారు, ఆత్మగౌరవం వెనుక అంతర్మథనాన్ని ఎన్.టి,ఆర్, రాజకీయాలు, వై.ఎస్.ఆర్ ల పాద యాత్ర లోతులను లోతుగా కాకపోయినా లోనారసి అనేలా లోకానికే కొన్ని ప్రశ్నలుద్భవించేలా చేశారు.

అంతేకాకుండా ఇందిరాగాంధీ అహాన్ని, పి.వి. నీలం సంజీవరెడ్డి చతురతను, ఇలా ఒకటేమిటి అనేక చారిత్రక కోణాలనుంచి పరిశోధించి, పరిశీలించి రాశారు. కార్మికుడి నుండి, కర్షకుడి వరకు, పూసగుచ్చినట్టు వివరించారు. నీరు పల్లమే కాదు మిట్టను కూడా ఎరుగు అని పామిరెడ్డి వంశీయులు రుజువుచేశారు. పాకనాటివారిది సుదీర్ఘ ప్రయాణం ఈ ప్రయాణంలో వారు ప్రతి కులాన్ని, ప్రతి జాతిని మేల్కొలిపారు. ఆదరించారు. ఈ గ్రంథంలో కేవలం పాకనాటి పాలకులదే కాదు ఆనాడు జీవించిన జన సామాన్యుల గురించి కూడా చక్కగా ఏ మాత్రం తారతమ్యాలు




నమ్మించలేదు. సాక్ష్యాలతో మన ముందుంచారు. అంతేకాకుండా కొత్తగా ఇంకేమైనా ఉన్నాయా అని పుట పుటలోనూ చదువుకుంటూ వెళుతుంటే ఆద్యంతం ఆసక్తి రేకెత్తించేలా ఉన్న ఈ పుస్తకంలో రెండున్నర శతాబ్దాలలో జరిగిన చారిత్రక,స్వాతంత్ర్య, సాంఘిక,రాజకీయ,ఆర్థిక,భాష,సంస్కృతి,సంఘటనల సమాహారం ఉంది.పాకనాటి వారి ఏడు తరాల జీవన వైఖరి,భారత దేశ రైతు కుటుంబాల జీవన చిత్రం,నీటి పారుదల రంగదర్శిని,తెలుగు వారి ఆలోచనల పురోగమనం ఉంది.

"మా చెట్టునీడ" అనేది పుస్తకం. "అసలేం జరిగింది" అనేది ఉప శీర్షిక. వెరసి 'మా చెట్టు నీడ- అసలేం జరిగింది' గా వెలువడిన ఈ గ్రంథం చదువుతుంటే పామిరెడ్డి వంశీయుల వృక్షం ఎంతమందికి నీడనిచ్చిందో, ఎన్ని పక్షుల కిలకిలారావాలకు ఆ చెట్టు కేంద్రమై నిలిచిందో, ఆ పక్షుల రెక్కల చాటున ఇంకెన్ని పక్షులై ఎదిగాయో, ఒక మనిషి నిస్వార్థంగా బతికితే చుట్టూ ఇంకెన్ని ప్రాణాల్ని మనం సంరక్షించవచ్చో మనకర్థమవుతుంది. అలాంటి నిస్వార్థనీడ, తరాల పాకనాటి వంశీయులజాడ "మాచెట్టునీడ".

సుధీర్ రెడ్డి ఎంచుకున్న అంశం చిన్నదేం కాదు. తల్లిదండ్రులనే గుర్తుపెట్టుకోని నేటి కాలంలో17 వ శతాబ్దం నుండీ తన వంశీయుల గురించి తెలుసుకొని, నాలుగు యుగాల చరిత్రను ఏడు అధ్యాయాలుగా వివరిస్తూ వాటికి చారిత్రాత్మకమైన అంశాలను క్రోడీకరించి చెప్పడమనేది చాలా పెద్ద చిక్కే. ఆచిక్కులో చిక్కుకుని ఉన్న మద్ధతును తగ్గించడానికి చేసిన కుట్రలను పూసగుచ్చినట్లు చెప్పారు సుధీర్ రెడ్డి.

అంతేకాకుండా పాకనాటి రెడ్లు మొట్టమొదట కట్టించిన గంగాపార్వతీ ఆలయం మొదలుకొని..వారు తవ్వించిన చెరువుల తవ్వకాలు, సత్రాలు, గ్రంథాలయాలు, జరిపించిన పెళ్లిల్లు ఒకటేమిటి అనేక నిజాలను వెతికి వెలికి తీశారు. వారి స్వంత గ్రామంలో మొదలైన పాకనాటి ప్రాభవాన్ని నేటి పోలవరం దాకా జరిగిన ప్రామాణిక ప్రయాణాన్ని గుర్తుచేస్తారు. వీరిది మట్టిప్రేమ, రైతన్నమీద ప్రేమ, మట్టిని బంగారం చేయాలనే గట్టి ప్రేమ. వీరి ప్రస్థానమంతా జలం కోసం, జనం కోసం, జగం కోసమనే విషయాలు మనకిట్టే తెలిసిపోతుంది. చెట్టుకు మట్టి, నీరు అవసరంకదా! అందుకే అందరికీ అవి అందాలని ప్రయత్నిస్తున్నారు.

నీళ్లుంటే అన్నీ ఉన్నట్లే. రాయలసీమకు నీళ్లను చూస్తే పెద్ద పండగొచ్చినట్టే. ఇప్పుడిప్పుడే అక్కడక్కడ కాలువల్లో నీళ్లను చూసి జగ్గిన్నక్క ఆడుతున్నాము. పూర్తిస్థాయిలో నీళ్లొస్తే నిత్యం కాళ్లకు గజ్జెలే. నీళ్లమీద ఇంత దుగద ఉందని తెలుసుకున్న రాయలసీమ నుండి ప్రాతినిథ్యం వహించిన ముఖ్యమంత్రులందరూ నీటి విషయంలో చాలా జాగ్రత్తే పడ్డారనిపిస్తుంది. నీళ్లను దూరం చేస్తేనే జనం నాయకులకు దగ్గరవుతారని వాళ్లకు తెలిసినంతగా ఇంకెవరికీ తెలియదుకదా. రాయలసీమ నీటి గురించి తలచుకుంటేనే కళ్లనిండానీళ్లు తిరుగుతాయి. అదిగో మళ్లీ నీళ్లంటున్నాను అంటే అవి చూపకుండా వివరించడం వారి సౌహార్ధ,సమానత్వ స్థితిని తెలియజేస్తుంది. వారు బాషకు, కళలకు ప్రాణం పోశారు. అంతేకాదు మూగప్రాణులకు కూడా జీవం పోశారు.చరిత్రను తవ్వి తీసి అనేక విషయాలను ఈ గ్రంథంలో చేర్చిన రచయిత అభినందనీయులు..ఈ గ్రంథం చదవాలని ఉత్సుకతగా ఉంది కదా. అయితే పామిరెడ్డి సుధీర్ రెడ్డి..వాట్సాప్ నంబర్.60 16-381 8079 లో సంప్రదించవచ్చు.

**- డా. బి. నాగశేషు**
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనకేంద్రం
నెల్లూరు, 9985509053

## పెన్నాసరాలు- 8

బతికి ఉండగ స్వీయ చితులను
చూచు భాగ్యము ఎడదకున్నది!
ఎల్లకాలము నిలుచు అశ్రువు
మరణభీతిని ఎరుగకున్నది!

సుడిగాలులైనా, వానలైనా
ముళ్ళనసలే రాల్చలేవు!
అకాలముగా రాలు పూవులు
ఏ భుజముపై తల వాల్చలేవు!

ఎంత అణచిన నలిగి చావవు
కొన్ని వెతలూ, మధురస్మృతులూ!
మట్టిలో బీజమును దాచితె
పెరిగి పూచును పుష్పతతులు!

తనువు ఎపుడూ మదికి ఇరుకగు
కారు చీకటి కలుగు లాంటిదె!
మనసు కూడా గూడు చెదిరితె
ఎగిరిపోయే పులుగు లాంటిదె!

నీడ తోడుగ లేకపోతే
వెలుగుకైనా ఎంత భయమో!
ఎపుడు ఒంటిగ యాత్ర చేసే
చిమ్మ చీకటి ఎంత నయమో!

కోరు గమ్యం చేరకుండనె
ముగిసిపోవును యాత్రలన్నీ!
భరతవాక్యం పలుకు దాకా
నిలిచి ఉండవు పాత్రలన్నీ!

**- పెన్నా శివరామకృష్ణ**
94404 37200

సాహిత్య పేజీలో ప్రచురణ కోసం వ్యాసాలు, కవితలు,పుస్తక సమీక్షలు క్రింది చిరునామాకు పంపవలసినదిగా మనవి. తమ పుస్తకాలను సమీక్ష కోసం పంపేవారు తప్పనిసరిగా రెండు ప్రతులు పంపాలి. తమ రచనలు యూనికోడ్ లో ఓపెన్ ఫైల్ మరియు పీడీఎఫ్ ఫైల్స్ మెయిల్ చేయాలి. మీరు పంపిన రచన ఈ పేజీలో అచ్చయ్యాకే ఇతర మాధ్యమాల్లో పెట్టుకోవాలి. దయచేసి రచయితలు సహకరించవలసినదిగా మనవి.

**k.wilsonrao@gmail.com**

# ప్రవహిస్తున్న నది పరిగెడుతున్న చరిత్రకు ప్రతీక

ఒక నది వొడ్డున జన్మించిన కవి,చరిత్రలోని కొత్త కోణాల కోసం,చరిత్రలోని పాత్రల నీడలు నిజాల వెంట ప్రయాణించిన అన్వేషి, "విచ్చుకోవాలి" అంటూ కవిత్వంగా పాఠకుల ముందుకు వచ్చిన కవి వై.హెచ్.కె.మోహన్ రావు.

కరువు కురిసిన మేఘమై,శాంతి దూతగా నాగమ్మను నిలబెడుతూ, కన్నెగంటి హనుమంతును జనం గుండెలమీద ఎగరేసి, ఇప్పుడు కవితలై విచ్చుకుంటున్నాడు.

వై.హెచ్ .కె మోహనరావు జర్నలిస్ట్ గా మొదలై కవిగా, గేయ రచయితగా, చరిత్ర పరిశోధకుడిగా సాహిత్య సృజనలో రెండు దశాబ్దాలు పైగా కృషిచేసాడు.

"అమ్మను అనువదిస్తే మట్టి అవుతుంది/అందుకే మట్టంటే అపారమైన వాత్సల్యం/మట్టిని నమ్మినవాడు పాదాలకు/ శిరస్సు వంచి నమస్కరిచాలి"..అంటాడొక కవితలో .

అలాగే కవిత్వం గురించీ మాట్లాడతాడు 'నిజంగానే' శీర్షికలో " అర్థం కావడమంటే/ ప్రతి పదాన్ని విప్పడం కాదు/ అది గుండెను నిద్రలేపినట్లుండాలి/అర్థం కావడమంటే/పుటల మీద పుటలు తడుపుకు పోవడం కాదు/ పదాలతోపాటు కవి శిరస్సును విసరడం కానేకాదు/ అర్ధంకావడం అంటే/వింటున్న వాడి తల ఊయలై ఊగాలి/ఆలోచనకు అంకురం కావాలి/ అదునెరిగిన అక్షరం/ అలుపెరగని కాలానికి కుదుపులా వుండాలి" - అంటాడు కవి.

ఒక ముగింపులేని కావ్యం కోసం తపన పడే మనస్తత్వం అతడిని మనకు కవిగా పరిచయం చేస్తుంది.


పోరు సాగి,రక్తపుటేర్లుగా పారిన పలనాడు.. కవిత్వానికీ,పాటకూ నెలవుగా సాగిందనడానికి సాక్ష్యంగా అభ్యుదయ భావాలతో కవిత్వం రాస్తున్న మోహనరావు కవిత్వం ఒక సాక్ష్యంగా నిలుస్తుంది.

మోహనరావు కవిత్వమైనా,పాటైనా చదివీ చదవగానే పాఠకుడికి యిట్టె అర్థమవ్వాలనే ఆలోచనతో రాస్తాడనిపిస్తుంది. ఇతని కవిత్వం లో నిగూఢంగానో,కప్పిపెట్టినట్లుగానో.. కవిత చివరి దాక దేనిగురించి చెప్పాడా కవి అని పాఠకుడు వెతకడమో, మధ్యలో దారితప్పడమో వుండదు. చెప్పాలనుకున్నది సూటిగా,సులభశైలిలో వస్తువును కవిత్వం చేయడమేలానో తెలిసిన నేర్పరి.

వ్యక్తిగా ఎంత నేరుగా మాట్లాడతాడో, కవిగాను అంతే. "విచ్చుకోవాలి" సంపుటిలోనూ అంతే. సమాజిక సమస్యల నుంచి ఉగాది వరకు, తనకు బాగా నచ్చిన గాంధీజీ,జాషువా ల వరకు అన్నిరకాల వస్తువులనూ కవిత్వం చేసాడు.

"చెట్లను గుర్తుతెచుకున్న ప్రతిసారి నది దర్శనమిస్తుంది నాకు" అంటాడీకవి. "సహస్ర బాహువులతో సహాయం చేయడానికి సిద్ధంగా వున్న దానకర్ణుడు కనిపిస్తాడు" ఇలా "హరిత ఛత్రం" కవితలో మోహనరావు భావ స్ఫోరకమైన ఇమేజరీలు వాడతాడు. దాదాపు ప్రతి మూడు వాక్యాలకు ఒక ఇమేజరీ కనిపిస్తూ, తనలో చెట్టును దర్శింపజేస్తుంది.చివరకు చెట్టుకు మొక్కడమే బతుకుకు పునాది అని ముగిస్తాడు.

"ఘనీభవిస్తున్న నదులు" పేరిట మతమౌడ్యాన్ని నిరసిస్తాడు మోహనరావు.అమ్మతనాలకోసం "ఒడి ఊయల" గా కవిత్వమై వర్షించిన ఈ కవి "దేశమంతా మందిరము,మసీదులు కాదు సమైక్య జీవన సమాహారం కావాలి" అంటాడు. శ్రామికజన జీవనాన్ని "రాతి మనిషి" గా కవిత్వీకరిస్తూ శిల్పి చేత సుతి మెత్తనితనాన్ని చక్కగా చెబ్తాడు. "చూపుడు వేలు" పేరిట గాంధీజీ ని కవిత్వం చేసినా "స్వేచ్ఛాదిక్సూకీ" పేరిట అంగ్సాన్ సూకీ ని అక్షరీకరించినా తనదైన శైలిని వదలని ఈ కవి శీర్షిక నుంచి ముగింపు వరకు ఈ కవితా సంపుటిలో కవిత్వమై ప్రవహిస్తాడు.




"మట్టికి మాటలు నేర్పి/వివక్షపై తూటాలు విసిరిన వాడు /వర్ణ సంకెళ్ళు తెంచి / "గణాలు"ను ఆకాశమార్గాలనుండి/స్మశాన వాటిక వైపు నడిపిన వాడు /ప్రాపంచిక వేదిక పై /తలక్రిందలు కథలు వినిపించిన వాడు" అంటూ జాషువాను తన గుండె నిండా నింపుకొని పలనాడు వాసిగా ప్రపంచానికి కవిత్వం చేసి చూపించాడు .

"పడి లేచే కెరటంతో ఏ మాట కలిపినా /గత కాలాల గుట్టు విప్పుతుంది /ప్రవహిస్తున్న నది/ పరిగెడుతున్న చరిత్రకు ప్రతీక" అంటాడో కవితలో.

అన్నట్లు ఈ కవితో ప్రాంతీయంగానో, మరో విధంగానో మాట కలిపితే సవివర పరిశోధనా చర్చ వైపు నడిపిస్తాడు.పాటై పరిమళిస్తాడు.

"ఎక్కడినుంచి వచ్చామో? ఎరుక లేకపోతే ఎక్కడికి వేళ్ళాలో కూడా తెలుసుకోలేము" అంటూ తాత్విక మూలాల గురించిన ఎరుకను చేస్తూ "విచ్చుకోవాలి" అనే శీర్షికతో కవితా సంపుటిగా మన ముందుకొచ్చిన వై.హెచ్.కె. మోహన్ రావు సాహితీ వికాసాన్ని ఆస్వాదిద్దాం.

**-కోసూరి రవికుమార్**
94913 36488

## కవిత్వం-పరామర్శ 19

### మాధవీ సనారా-అనకాపల్లి

బాల్యం నుండి 60 ఏళ్ళపాటు ఖరగ్ పూర్ (పశ్చిమ బెంగాల్)లో నివసించి 2007లో విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి వచ్చి స్థిరపడిన డెబ్భై నాలుగు వసంతాల తేజస్సంపన్నుడు మాధవీసనారా.

1962లో చిత్రగుప్తలో చిన్న కథతోను,68 లో ఆరుద్ర రాసిన కొత్త ఒరవడి కవిత విని ఆ స్ఫూర్తితో మరో ఒరవడి రాసి కవిత్వానికి శ్రీకారం చుట్టిన ఈ కవి ఇటీవలే సాహితి షష్టి పూర్తి చేసుకున్నారు. ఖరగ్ పూర్ లో ఉన్నప్పుడు విలేఖరిగా,కవిగా,సాహితీ వ్యాసాలు రాస్తూ పలు బాధ్యతలు నిర్వహించినా అనకాపల్లిలో స్థిరపడిన తరువాత కవితా రచనే ప్రధాన వ్యాపకంగా చేసుకున్నారు.అక్కడైనా ఇక్కడైనా సాహిత్య వ్యాసంగం ఆపింది లేదు. బాల సాహిత్యం, భావ కవిత్వం,అభ్యుదయ కవిత్వం,విప్లవ కవిత్వం,కథ, మినీ కవిత్వంతో పాటు, అనేకమంది సాహితీవేత్తలతో తాను ప్రయాణించిన సందర్భాలలో ప్రయాణానుభవాలను నమోదు చేస్తూ వివిధ పత్రికలలో వ్యాసాలు రాస్తూ..అన్ని ప్రక్రియల్లోనూ తన ముద్ర స్పష్టం. ఏ ప్రక్రియలో తను సృజన చేసినా వస్తువుతో పాటు సంవిధానానికీ తగిన ప్రాధాన్యతనిచ్చే వీరి సాహిత్యానికి దక్కిన అనేక పురస్కారాలతోపాటు

ఆటా, కుందుర్తి(రెండుసార్లు) పోటీల్లో బహుమతులు పొందారు.

తరం తరం(కుందుర్తి) కవితా సంకలనం లాంటి వాటిలో తన కవితలు చేరాయి.వచన సాహిత్యంలో ప్రగతిశీల కవిగా స్థిరపడిన వీరు ఇప్పటిదాకా

"మనో గవాక్షం,అమ్మమ్మ చేతి కడియాలు,నిప్పుబొమ్మ,నడక అను మనిషి నుండి మనీషికి.. " గ్రంధాలు ప్రచురించారు. వీరి సాహిత్యంపై ఆంధ్రవిశ్వ విద్యాలయం విద్యార్థి వి.రామకృష్ణ గారు పరిశోధన చేసి పి.హెచ్ డి పట్టా పొందారు. వీరి కవిత చదివి ఒకసారి ఫోన్ చేసి అభినందిద్దామా.

### అయినా ధైర్యంగానే

కొంచెం గుండెదిటవు కావాలి
ఉన్నది ఉన్నట్లు అనెయ్యడానికి
మంచిని మంచి అనీ
చెడును చెడు అనీ చెప్పటానికి-

ఇప్పుడు
దేహమంతటా వినయం కమ్మేసి
అతి చాకచక్యంతో
మదగజ స్వైరవిహారం
చెలరేగిపోతోంది-
దాని విచ్చలవిడి గమనాన్ని
అరికట్టడానికి
అంకుశాన్ని పదునుపెట్టగలిగే
గుండెదిటవు అవసరం

ఊపిరి సలపనివ్వని
మాయాద్యూత విన్యాసాలు
బావిలో అభివృద్ధిజలాలు
అడుగంటుతున్న వైనాలు
వెళ్ళడించడానికి
కొంచెం గుండెధైర్యం కావాలి-

పత్రికల్లోకి ఎక్కి అయినా
ప్రజావేదికల మీద నిలబడైనా
నిజం నిప్పును గుప్పిట పట్టుకోడానికి
ఉరికురికి వచ్చే వాస్తవం డోకును
నిలవరించకుండా కక్కెయ్యడానికి
ధైర్యంతో కూడిన గుండె దిటవు కావాలి.



**- మాధవీసనారా**
86394 91246

### పై కవితకు పరామర్శ చూద్దామా..

ఈ కవి ఉద్దేశ్యంలో ఈ రోజున స్వేచ్ఛ క్రమంగా అందరికీ చెందినది కాకుండా పోతున్నది. ప్రజాస్వామ్యం మేడిపండు లా మారి క్రమంగా తన నిజరూపం ప్రదర్శిస్తున్నది. స్వేచ్ఛ నెమ్మదిగా కొందరి కోసమే అనే భావనతో నడుస్తున్నదననే అభిప్రాయం కలగటానికి ఎక్కువ ఉదాహరణలు అవసరం లేకుండా పోతున్నది. మెజారిటీ అభిప్రాయం, మైనారిటీ అభిప్రాయం అనే భావనలూ అడుగంటుతున్నాయి. సోషల్ మీడియాపైన కూడా ఉక్కుపాదం మోపి భావ భావ వ్యక్తీకరణకి అడ్డంకులు సృష్టిస్తున్నారనే వార్తలూ వస్తున్నాయి. కవిత్వంలో వ్యక్తీకరణకి, భావజాలాల పరివ్యాప్తికి ఉండే సహజన్యాయం దూరమవుతున్నదనే అభిప్రాయం మన ముందుకి వచ్చిందని కవి అంటున్నాడు. ఈ తరుణంలో వ్యక్తి స్వేచ్ఛకి పాకులాడటం కోసం అన్ని ఆయుధాలూ సమీకరించు కోవటం కవులుకి అత్యవసరంగా ఉందనే భావంతో "అయినా ధైర్యంగానే" అనే కవిత మన ముందు నిలబడి ఈ ప్రశ్నని వేసింది. కవి.. "స్వేచ్ఛ కోసం గుండె దిటవు అవసరం/ కొంచెం గుండె ధైర్యం కావాలి/ ధైర్యంతో కూడిన గుండె దిటవు కావాలి'.. అని వాచ్యంగా పిలుపునిస్తున్నారు. కేవలం గుండె దిటవు ఉంటేనే సరిపోతుందా అని ప్రశ్న వేసుకుంటే.. అందుకు తగ్గ సమాధానం ఈ కవితలో లేదు. కవి.. మార్మికంగా మనల్ని ఊహించుకో మంటున్నాడు. పాఠకుడి ఆలోచనకి పదును పెట్టాలనే భావన కవిలో తారాడుతున్నది.

కవిత ప్రబోధాత్మకంగా నడిచింది. వాస్తవ పరిస్థితిని చాలా సూటిగా, నిర్మొహమాటంగా చెప్పింది. "ఉన్నది ఉన్నట్లు అనేయడానికి, విచ్చలవిడి గమనాన్ని అరికట్టడానికి, నిజం నిప్పును గుప్పిట పట్టుకోవడానికి, వాస్తవం నిలవరించకుండా కక్కేయ్యడానికి.. ధైర్యంతో కూడిన గుండె దిటవు కావా"లని కవి కోరుతున్నాడు. ఈ భావజాల వ్యాప్తికి కవి ఒక వ్యాసంతో సరిపెట్టుకోవచ్చు. కానీ వాచ్యంగానైనా సరే కవితని స్వీకరించడంలో కవికి ఓ ఎత్తుగడ ఉంది. ఒక వ్యూహం ఉంది. కవిత ధ్వన్యాత్మకంగా నడిచి వీలైనంత ఎక్కువ మందికి అర్థమయ్యేటట్లు ప్రయత్నించడం అభ్యుదయ కవులు చేసే పని కదా!

**సాగర్ శ్రీరామకవచం**
98854 73934



## "దీపావళి కథల పోటీ"

పాలపిట్ట-డాక్టర్ అమృతలత సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి కథలపోటీని నిర్వహించాలని పాలపిట్ట సంపాదకవర్గం నిర్ణయించింది. మంచి కథలని ప్రోత్సహించే లక్ష్యంతో తలపెట్టిన ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 10,000, రెండో బహుమతిః రూ. 6000, మూడో బహుమతిః రూ. 4000, పది ప్రత్యేక బహుమతులు..ఒక్కొక్క కథకి రూ. 1000. మానవ జీవితం అనేక అనుభవాల సమాహారం. కనుక ఎలాంటి ఇతివృత్తం ఎంచుకోవాలో కథకుల నిర్ణయమే. తీసుకున్న వస్తువును కథగా మలచడంలో చూపిన ప్రతిభకే ప్రాధాన్యం.

- పోటీకి పంపించే కథలకు ఎలాంటి పేజీల పరిమితి లేదు..
- పోటీకి పంపించే కథలు సొంత కథలయి ఉండాలి. అలాగే ఇదివరలో ఎక్కడా ప్రచురితం,ప్రసారితం కాకూడదు. సోషల్ మీడియాలోగానీ, ఇతర వెబ్సైట్లలో గానీ ప్రచురితమై ఉండరాదు. ఈమేరకు కథతోపాటు హామీపత్రం పంపించాలి.

కథలు చేరడానికి చివరితేదీ - 15 అక్టోబర్ 2021.కథలని పోస్టు చేయవచ్చు లేదా మెయిల్ లోనూ పంపవచ్చు.

చిరునామాః ఎడిటర్, పాలపిట్ట
ఎఫ్-2, బ్లాక్ -6, ఏపిహెచ్బి
బాగ్లింగంపల్లి, హైదరాబాద్-500044
ఫోనుః 9490099327
Email: palapittamag@gmail.com

**- పాలపిట్ట బుక్స్**